క్లుప్తంగా

పింఛన్లతో రాజకీయమా..!

పొన్నూరు: వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేయకుండా తన అనుచరులతో కలిసి ఎన్నికల కమిషన్ ద్వారా అడ్డుకోవడం చంద్రబాబునాయుడి నీచత్వానికి పరాకాష్ట అని, దివ్యాంగులు, వృద్ధుల విషయంలో ఇలాంటి నీచ రాజకీయాలు అవసరమా అని పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్ ధ్వజమెత్తారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మనోహర్ రావు పాల్గొన్నారు.

న్యాయవాది సతీష్‌కుమార్‌కు న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న గంటా సతీష్‌కుమార్ 'సైబర్ క్రైమ్ అండ్ సైబర్ లా ఇన్ ఇండియా పర్స్పెక్టివ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను కేఎల్ డీమ్డ్ వర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. వర్సిటీ న్యాయ శాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ పవన్‌కుమార్ మార్గదర్శకంలో ఆయన పరిశోధన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ నేర పరిశోధనలో డిజిటల్ చట్టంలోని చిక్కులపై సునిశిత దృష్టితో దేశంలో సైబర్ స్పేస్‌ను నియంత్రించే చట్టపరమైన ఫ్రేమ్ వర్క్‌ను అర్థం చేసుకునేందుకు ఇప్పటికే ఉన్న చట్టాలపై అవగాహన కలగడంతో పాటు డిజిటల్ డొమైన్‌లో అభివృద్ధి చెందుతున్న సవాళ్లను పరిష్కరించడానికి తన పరిశోధన ఉపయోగపడుతుందని చెప్పారు. చట్టపరమైన సంభాషణను అభివృద్ధి చేయడంతో పాటు డిజిటల్ హక్కులను రక్షించడంలో విద్యా పరిశోధన ప్రాముఖ్యతను తెలియజేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గంటా సతీష్ కుమార్‌ను కేఎల్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, న్యాయవాదులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, చింతా రామకోటిరెడ్డి, సురేంద్ర అభినందించారు.

ఒక్కరోజే 86.17 శాతం పెన్షన్లు పంపిణీ

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో గురువారం ఒక్కరోజే 86.17 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తయింది. నేటి నుంచి వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దకు వెళ్లి వార్డు సెక్రెటరీలు పెన్షన్ అందజేయనున్నారు. ఇప్పటికే నగరంలోని 207 వార్డు సచివాలయాల్లో పెన్షన్ పంపిణీ సమయంలో ప్రజలకు ఎండ వల్ల ఇబ్బంది కలుగకుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు, ఓఆర్ఎస్‌ప్యాకెట్లు అందజేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా నేటి సాయంత్రం నాటికి వంద శాతం పింఛన్లు పంపిణీ చేయడానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

రామాయణ పఠనంతో జీవితం ఆనందమయం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం సంక్షిప్త రామాయణంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆలయ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కె.వి.కోటేశ్వరరావు ప్రవచనాన్ని కొనసాగిస్తూ మానవుడు తన జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలంటే రామాయణ పఠనం అత్యంత ఆవశ్యకం. జీవితంలో అజ్ఞానాన్ని దూరం చేసి జ్ఞాన మార్గంలో నడవాలంటే మానవులు ప్రతిరోజు కొంతసమయాన్ని కేటాయించి రామాయణ పఠనం చేయడం ద్వారా శాంతి, సౌఖ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మన్నవ రవిప్రసాద్, తూనుగుంట్ల సుందరరామయ్య, వి.శివారెడ్డి, అంకినీడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

గుంటూరు రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ నరేష్‌కుమార్ కథనం ప్రకారం జేకేసీ కళాశాల రోడ్డులో కంటె వెంకటరావు అనేవ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. విషయం తెలిసి దాడి చేయగా అతని వద్దనుంచి 20 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

నెహ్రూ నగర్: పెరుగుతున్న ఎండల దృష్ట్యా నగరంలో ప్రజలకు, నగరానికి విచ్చేసే వారి దాహార్తి తీర్చడానికి చలివేంద్రాల ఏర్పాటును పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలో చలివేంద్రాల ఏర్పాటు, సిబ్బంది కేటాయింపు పై నగరపాలక సంస్థ ఎస్.ఈ., ఇంజినీరింగ్ అధికారులకు సెట్ కాన్ఫరెన్స్ ద్వారా తగు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున నగరంలోని ప్రధాన కేంద్రాల్లో, జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో నగరపాలక సంస్థ తరుపున సుమారు 45 ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా ఇప్పటికే 19 ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని, మిగిలినవి త్వరగా పూర్తిచేయాలని ఎస్ఈని ఆదేశించారు. చలివేంద్రాలు ఆవశ్యకమని తెలిపారు.

మంచి జరిగితేనే ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- చింతలపూడిలో జోరుగా ఎన్నికల ప్రచారం



చింతలపూడిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా వృద్ధురాలిని పలకరిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంచి జరిగి ఉంటే ఓటు వేసి ఆశీర్వదించాలని ఆ పార్టీ పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ప్రజలను కోరారు. గురువారం మండలంలోని చింతలపూడి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గడప గడపకూ వెళ్లి ఓటు అభ్యర్థిస్తూ ప్రచార పత్రాలను అందజేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ జగనన్న చేసిన మేలును వివరించారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ఉంచిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. 58 నెలలలో 98 శాతం హామీలను అమలు చేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి జరిగిందని, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేకూరిందన్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పాలన అందించిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించి మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలంతా ఆశీస్సులు అందించాలని కోరారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో చంద్రబాబు అండ్ కో, పచ్చమీడియా ప్రజలను ఏమార్చడానికి లేనిపోని అసత్యాలను ప్రచారం చేస్తున్నారని అలాంటి వాటిని నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కర్లపూడి రమేష్, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్. రూత్ రాణి, సర్పంచ్ భవనం వంశీరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్. నాజర్, వడ్రాణం ప్రసాద్, బొద్దులూరి రంగారావు, అమిరినేని సాంబశివరావు, ఎంఎ మహమూద్, షేక్. మాము పాల్గొన్నారు.

ఫించన్ కోసం వెళ్లిన వ్యక్తి మృతి చెందడం బాధాకరం

పెదకాకాని: ఫించన్ తీసుకునేందుకు వెళ్ళిన వ్యక్తి అనారోగ్యానికి గురై మృతి చెందడం బాధాకరమని పొన్నూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన సయ్యద్ ఖాదర్ భాష పింఛన్ కోసం సచివాలయానికి వెళ్ళి వడదెబ్బ తగిలి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంగతి విదితమే. ఖాదర్‌బాషా మృతదేహాన్ని అంబటి మురళీకృష్ణ గురువారం సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో స్థానిక నాయకులు వుయ్యూరు సతీష్‌రెడ్డి, మందాళ శివారెడ్డి, భీమవరపు కృష్ణారెడ్డి, కోడూరి శామ్యూల్, ఎంపీటీసీ సభ్యుడు షేక్ లతీఫ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి, జొన్నల గంగాధరరెడ్డి, షేక్ దండి బాబు, సయ్యద్ సుబాని ఉన్నారు.



సయ్యద్ ఖాదర్‌బాషా మృతదేహాన్ని సందర్శించిన అంబటి మురళీకృష్ణ

చేబ్రోలులో 90 శాతం పింఛన్లు పంపిణీ



సచివాలయం వద్ద పెన్షన్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు, వికలాంగులు

చేబ్రోలు: మండలంలోని 17 గ్రామ సచివాలయాల ద్వారా సిబ్బంది 90 శాతం మంది పెన్షన్‌దారులకు మూడు వేల నగదు పెన్షన్‌లను గురువారం నాటికి అందజేసినట్లు అధికారులు తెలిపారు. చేబ్రోలు మండలంలో వృద్ధాప్య, వికలాంగ, వితంతు తదితర 10417 మంది పెన్షన్‌దారులు ఉన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా వలంటీర్లు ద్వారా ఇంటి వద్దకే వచ్చి పెన్షన్‌లు అందజేయగా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో సచివాలయాల సిబ్బంది పెన్షన్‌లను అందజేశారు. నడవలేని, వికలాంగ, వృద్ధులకు, సచివాలయం వరకు రాలేని వారికి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లను సచివాలయ సిబ్బంది అందజేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ చేపట్టారు. గురువారం తెల్లవారుజాము నుంచే పెన్షన్‌దారులు సచివాలయవద్దకు చేరుకొని సిబ్బంది రాక కోసం ఎదురు చేశారు. వేసవి దృష్ట్యా సచివాలయ వద్ద టెంట్‌లు వేసి కుర్చీలను ఏర్పాటు చేశారు. తాగునీటి అవసరాల కోసం వాటర్ క్యాన్‌లను ఉంచారు. పలుచోట్ల సచివాలయ వద్ద ఏర్పాటు చేసిన టెంట్‌ల వద్ద పెన్షన్‌దారులు వేచిచూశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు వేసవిలో సచివాలయాల వద్దకు వచ్చి పెన్షన్ డబ్బులు తీసుకోవటానికి అవస్థలు పడ్డారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనను త్వరగా పూర్తి చేయాలని, బీఎల్‌ఓలు తమ పరిధిలోని ఓటర్లకు పోలింగ్ కేంద్రం వివరాలు తెలియచేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను, బీఎల్‌ఓలను ఆదేశించారు. గురువారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని సెక్టార్ 3 పరిధిలోని పాత గుంటూరు, వినోభా నగర్, ఎల్బీ నగర్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఏఆర్‌ఓలు, సెక్టోరల్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులైన ర్యాంప్‌లు, ఓటర్ల రాకపోకలకు వీలుగా బ్యారీకేడింగ్, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాల కల్పన వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలు పాఠశాలల్లో ఉన్నందున, కొన్ని గదుల్లో నాడు నేడు పనుల సామగ్రి, ఇతర మెటీరియల్ ఉంటే వాటిని సంబంధిత ప్రధానోపాధ్యాయులతో చర్చించి వేరే గదులకు తరలించాలన్నారు. ఒకే కేంద్రంలో ఉండే ఒకటి కంటే అధికంగా పోలింగ్ స్టేషన్లు ఉంటే ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఏఈని ఆదేశించారు. ప్రతి కేంద్రానికి సంబంధిత పోలింగ్ కేంద్రం నంబర్, బీఎల్‌ఓ పేరుతో బోర్డ్‌లను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను, పోలింగ్ కేంద్రాలను సెక్టోరల్ అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఏఆర్‌ఓలు నియోజకవర్గంలో ర్యాండంగా కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. అనంతరం బీఎల్‌ఓలతో గత ఎన్నికల్లో జరిగిన పోలింగ్ సరళి, పోలింగ్ శాతం ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌ఓలు తమ పరిధిలో ప్రతి ఓటరు ఓటింగ్‌లో పాల్గొనేలా ఓటింగ్ శాతం పెంచాలని, ఓటర్లకు పోలింగ్ స్టేషన్ వివరాలు తెలియచేయాలన్నారు.

పర్యటనలో ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు, వెంకటలక్ష్మి, సెక్టోరల్ అధికారులు నాగ శేషు, శ్రీధర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డీఈఈ శ్రీధర్, ఏసీపీలు మురళి, అజయ్ కుమార్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆహారం వృథాకానివ్వకండి



మాట్లాడుతున్న ఇందుశేఖర్

లక్ష్మీపురం: ఆహారం వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం 'ఆహారం వృథాని అరికట్టడం అందరి బాధ్యత' అంశంపై సమావేశం జరిగింది. సమావేశంలో హెల్త్ అవేర్‌నెస్ అధ్యక్షుడు ఎ. ఇందుశేఖర్ మాట్లాడుతూ 2022లో ప్రపంచ వ్యాప్తంగా 105 బిలియన్ టన్నుల ఆహారం వృథా అయిందని, మరో వైపున ప్రపంచ వ్యాప్తంగా 783 మిలియన్ల మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. విద్యా వేత్త ఎస్.రవిబాబు మాట్లాడుతూ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ అంచనా ప్రకారం భారత దేశంలో ఉత్పత్తి అవుతున్న ఆహారంలో దాదాపు 40 శాతం ఆహారం వృథా అవుతుందన్నారు. మరోపక్కన జనాభాలో 15 శాతం మంది ప్రతిరోజూ ఆకలితో అలమటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.నారపరెడ్డి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక ఉద్యోగిపై వేటు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూ నగర్: కూటమి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం వెహికల్ షెడ్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఎస్.రమణాను విధుల నుంచి తొలగిస్తూ నగర కమిషనర్, తూర్పు ఆర్ ఓ కీర్తి చేకూరి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ఎన్నికల ప్రచారంలో జీఎంసీ ఉద్యోగి' అనే శీర్షిక గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన కమిషనర్ రమణాను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: మానసిక రోగి కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంకమ్మరావునగర్‌కు చెందిన ఎ.రాజు (32) మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 1న సిగరెట్ కాల్చేక్రమంలో అగ్గిపుల్ల జేబులో వేసుకున్నాడు. మంటలు వ్యాపించి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతనిని జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

సాంకేతిక నైపుణ్యాలతో ఉజ్వల భవిష్యత్



గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అలవర్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెనాలి ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ్‌చంద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో "కంప్యూటర్ సైన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్" అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కంప్యూటర్ సైన్స్ రంగంలో ఒడిదుడుకులను తట్టుకుని విజయం సాధించేందుకు కాలానుగుణమైన విషయ పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్ జీపీటీ తదితర సాంకేతిక విజ్ఞానంలో గల అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించిన సదస్సులో భాగంగా వివిధ కళాశాలల నుంచి వచ్చిన 120 మంది పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధన పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్ పాల్గొన్నారు.

పరమ పవిత్ర మాసం రంజాన్

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని
- ప్రత్తిపాడులో ఇఫ్తార్ విందు
- మతపెద్దలతో కలిసి ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: రంజాన్ మాసం పరమపవిత్రమని ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పమిడి వెంకటరావు ఫంక్షన్ హాల్‌లో ముస్లిం సోదరులు గురువారం రాత్రి 'ఇఫ్తార్' విందును నిర్వహించారు. హాజరైన బలసాని కిరణ్ ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భోజనం వడ్డించి ఇఫ్తార్ విందును ప్రారంభించారు. ఈ సందర్భంగా బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్ర మాసమన్నారు. ముస్లింలు కఠిన నియమ నిష్టలతో ఉపవాస దీక్షను చేసి అల్లాను ప్రార్థిస్తారని చెప్పారు. దానగుణానికి రంజాన్ ప్రతీక అని తెలిపారు. ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన రంజాన్ మాస ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. అల్లా దయతో నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని బలసాని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ముఫ్తీఫాయజ్, బాషా, సలాం, షేక్ బాజి, సబ్జాఖాన్, మాలిక్, షేక్ అలి, ముస్లిం సోదరులు, నాయకులు, పాల్గొన్నారు.

సీఎం జగన్ రుణం తీర్చుకుందాం

- మరోసారి సీఎంగా గెలిపించుకుందాం
- వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్



చమళ్లమూడిలో కిరణ్‌కుమార్‌కు సమస్యలను విన్నవిస్తున్న మహిళలు

ప్రత్తిపాడు: సీఎం జగన్ రుణం తీర్చుకునే సమయం మన ముంగిటకు వచ్చిందని, మరోసారి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడిలో గురువారం రాత్రి బలసాని కిరణ్‌కుమార్ పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అన్న వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌ను ఢీకొట్టలేక ప్రతిపక్షం నీచ రాజకీయాలకు తెరలేపుతుందన్నారు. చివరికి పింఛన్లు సైతం వలంటీర్లు ఇవ్వకుండా చంద్రబాబు తన అనుయాయులతో పిటీషన్లు వేయించి వృద్ధులకు నరకం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు యథాతథంగా కొనసాగాలన్నా, పేదల మోముల్లో నిత్యం చిరునవ్వులు ఉండాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావలసిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మన్నవ వీరనారాయణ, గ్రామ పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతోనే నూతన ఆవిష్కరణలు

బ్లూలోటస్ సంస్థ చీఫ్ మెంటర్ డాక్టర్ కుముదిని రవీంద్ర



నూతన ఆవిష్కరణలు పరిశీలిస్తున్న డాక్టర్ కుముదిని రవీంద్ర

గుంటూరు రూరల్: విద్యార్థి వినూత్న ఆలోచనలతో జరిగే నూతన ఆవిష్కరణలు విభిన్న రీతిలో సమాజ దోహదానికి పాటుపడే విధంగా ఉండాలని బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్లూలోటస్ సంస్థ చీఫ్ మెంటర్ డాక్టర్ కుముదిని రవీంద్ర పేర్కొన్నారు. గత రెండు రోజులుగా చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఇన్నోవేషన్ అండ్ డిజైన్ థింకింగ్, మాస్టరింగ్ అవుట్ కంబేస్డ్ ఎడ్యుకేషన్ ఫర్ ఫ్యాకల్టీ అనే అంశాలపై జరుగుతున్న జాతీయస్థాయి వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వారి ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. డిజిటల్ సేవల ద్వారా జరుగుతున్న నగదు బదిలీ వ్యవహారంలో పిల్లల ద్వారా జరిగే నగదు బదిలీ దుర్వినియోగం కాకుండా హెచ్చరిక చేస్తూ తగు సమాచారాన్ని తల్లిదండ్రులకు చేరవేసే నూతన ఆలోచనతో కూడిన ఆవిష్కరణ, ప్రస్తుతం అందుతున్న వాతావరణ సమాచారం బదులుగా రెండు రోజుల ముందుగానే వివిధ ప్రాంతాల్లో ఏర్పడే స్పష్టమైన వాతావరణ సమాచారాన్ని అందించే నూతన ఆలోచనలతో కూడిన ఆవిష్కరణలు ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థి చదువు పూర్తి చేసుకుని బయటికి వెళ్లే సమయానికి వారికి విద్యతో పాటుగా వివిధ అంశాలపై పూర్తిస్థాయిలో తర్ఫీదు నిచ్చేందుకు అనుసరించాల్సిన పద్ధతులను మెలకువలను ఈ కార్యక్రమంలో ఆమె అధ్యాపక బృందానికి వివరించారు. విద్యార్థి ఆలోచనలను ప్రయోగాత్మకంగా విజయం సాధించడానికి నిపుణులచే నిర్వహించే ఇటువంటి వర్క్ షాప్‌లు దోహదపడతాయని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ త్రిపుర, డాక్టర్ స్వర్ణశ్రీ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



సెల్ఫీ దిగుతున్న సబ్ రిజిస్ట్రార్ బాలగురవయ్య



ప్లకార్డులతో మహిళలు

తెనాలిఅర్బన్: ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని తెనాలి సబ్ రిజిస్ట్రార్ కె.బాలగురవయ్య కోరారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై కొత్తపేటలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఎన్నికల కమిషన్ ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. మే 13న జరిగే ఎన్నికల్లో అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఆయన ఓటర్ సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగారు. అలాగే ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో కమిషనర్ బి.శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు పాల్గొన్నారు.

7న ఊపిరితిత్తుల సమస్యలపై అవగాహన

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ ఉదయం కొత్తపేటలోని స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆరోగ్య అంశంపై సమావేశం నిర్వహిస్తున్నట్టు ఒక ప్రకటనలో క్లబ్ అధ్యక్షులు వెంకటరత్నం గురువారం తెలియజేశారు. ఉదయం 7 గంటలకు ఏర్పాటయ్యే సమావేశంలో ప్రముఖ ఊపిరితిత్తుల నిపుణులు డాక్టర్ యలమంచిలి కావ్య 'వృద్ధులు-ఊపిరితిత్తులలో మార్పులు-శ్వాసకోశ వ్యాధులు-నివారణ' అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. సభ్యులంతా తప్పక పాల్గొని విజయవంతం చేయాలని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తా వెంకటరత్నం, కడియాల రవిబాబు కోరారు.

ప్రతిపక్షం తెచ్చిన తిప్పలు!!



నంబూరు సచివాలయంలో వేచిఉన్న పింఛన్‌దారులు

ఫించన్‌ల కోసం సచివాలయాలకు వెళుతున్న వృద్ధులు, వికలాంగులకు అవస్థలు తప్పడం లేదు. సచివాలయాల వద్ద బుధవారం 3 గంటల నుంచి ఫించన్ పంపిణీ చేసిన సిబ్బంది గురువారం ఉదయం 8 గంటల నుండే ఫించన్‌ల పంపిణీ ప్రారంభించారు. ఎండను సైతం లెక్కచేయకుండా ఫించన్‌దారులు సచివాలయాల వద్దకు చేరుకుంటున్నారు. అధికారులు ఫించన్ ఎప్పటి వరకు ఇస్తారనేది స్పష్టత లేకపోవడంతో ఫించన్‌కోసం పరుగులు తీస్తున్నారు. ఈనెలలో ఉగాది, రంజాన్ పండుగలు ఉండటంతో నడవలేని వారు సైతం కుటుంబసభ్యుల బైక్‌ల పైన, ఆటోల్లో, బల్ల రిక్షాల పైనా సచివాలయానికి చేరుకుని ఫించన్‌లు అందుకుంటున్నారు. వలంటీర్ల ద్వారా ఫించన్ పంపిణీ చేస్తే ఇబ్బందులు లేకుండా ఇంటికే వచ్చి ఇస్తున్నారని, వృద్ధులను, వికలాంగులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు స్పందించి వలంటీర్ల ద్వారా ఫించన్‌లు ఇవ్వాలని కోరుతున్నారు.

–పెదకాకాని



పింఛన్ తీసుకునేందుకు నంబూరులో బల్ల రిక్షాపై సచివాలయానికి వచ్చిన వృద్ధులు